క్లుప్తంగా

రేపు ఉచిత వైద్య శిబిరం

తంబళ్లపల్లె: మహాశివరాత్రిలో భాగంగా మల్లయ్యకొండపై గల శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో జరిగే ఉత్సవాలకు భక్తులు వస్తారు. కోసువారిపల్లె పీహెచ్‌సీ వైద్యులు నిరంజన్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు నిరంతరంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ తెలిపారు. వైద్యంతోపాటు ఉచితంగా మందులు అందజేస్తామన్నారు.

అన్నదానానికి బియ్యం వితరణ

తంబళ్లపల్లె: శివరాత్రి రోజున మల్లయ్యకొండకు వచ్చే భక్తులకు శ్రీమల్లికార్జునస్వామి వెల్ఫేర్ అసోసియేషన్(అన్నదాన ట్రస్టు) ఆధ్వర్యంలో భక్తులకు రుచికరమైన వంటకాలతో అన్నదానం నిర్వహిస్తారు. టీఎస్ కుటుంబీకులు, ప్రముఖ పారిశ్రామిక వేత్త టీఎస్ విజయనారాయణరెడ్డి గురువారం అన్నదాన ట్రస్టుకు రూ.27వేలు విలువచేసే బియ్యం బస్తాలను వితరణగా అందజేశారు. ఆ బియ్యాన్ని అన్నదాన సేవాసంఘం అధ్యక్షులు రమణారెడ్డి, కార్యదర్శి భాస్కర్‌రెడ్డిలకు అందజేశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

పీలేరు : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో డాక్టర్ మురళీమోహన్‌రెడ్డి, హౌసింగ్ డీఈ గోపాల్‌నాయక్ అన్నారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఐదు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, ఏపీఎం లక్ష్మణ్‌రెడ్డి, ఏపీవో మహేశ్వర్, ఈవో రెడ్డిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

మంచి నడవడిక ఉన్నవారే ఉత్తములు

గుర్రంకొండ: సమాజంలో మంచి నడవడిక ఉన్నవారే ఉత్తములని జమాతే ఇస్లామి హింద్ జిల్లాశాఖ అధ్యక్షులు ఆజమ్ ఆలీఖాన్ అన్నారు. గురువారం పట్టణంలోని పలువురు ప్రముఖులను కలుసుకొని మానవత – నైతికత అన్న అంశంపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో శాంతియుతంగా జీవించడం అలవరుచుకోవాలన్నారు. ప్రతి మనిషి నైతిక విలువలు కలిగి ఉండాలన్నారు. సమాజంలో మానవత్వం ఉన్న మనిషి అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సయ్యద్ హాషీమ్, ఎండీ అబ్దుల్లా, నయాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

పీలేరు : క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దామని డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని వైద్య, ఆరోగ్య సిబ్బందికి టీబీ వ్యాధి నిర్మూలనపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విధానంతో టీబీని నివారించవచ్చునని తెలిపారు. క్షయ నివారణ విధానంలో వ్యాధి నిర్ధారణ తరువాత చికిత్స ఉందని తెలిపారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీ ధరలకు ఎరువులు విక్రయించాలి

మదనపల్లె : ఎరువుల దుకాణ యజమానులు తమ వద్ద ఉన్నటువంటి స్టాక్‌కు అన్ని పత్రాలు సక్రమంగా ఉంచుకోవాలని, ఎమ్మార్పీ ధరలకు ఎరువులను విక్రయించాలని మదనపల్లె ఏడీఏ దీక్షాకుమారి అన్నారు. గురువారం ఏఓ నాగప్రసాద్, కృష్ణవేణితో కలిసి మండలంలోని ఎరువుల దుకాణాల్లో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వివిధ షాపుల్లో సరైన పత్రాలు, ఫారం-ఓ లైసెన్స్ లేని రూ.12.5లక్షల విలువైన 34 టన్నుల ఎరువులకు అమ్మకపు నిలుపుదల ఆదేశాలు, నోటీసులు జారీచేశారు.

పెద్దతిప్పసముద్రం: ఎరువులు, క్రిమి సంహారక మందులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వాయల్పాడ్ ఏడీఏ వాణిశ్రీ వ్యాపారస్తులను హెచ్చరించారు. గురువారం ఆమెతో పాటు ఏఓ ప్రేమలత మండలంలోని కందుకూరు, మద్దయ్యగారిపల్లి, పీటీఎం గ్రామాల్లోని ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. తూనికల్లో వ్యత్యాసాలు వచ్చినా లైసెన్సులు రద్దు చేస్తామన్నారు.

క్రమశిక్షణతో చదవాలి

కలికిరి: పదవ తరగతి విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యనభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంఈఓ రంగనాథరెడ్డి అన్నారు. పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా పర్వ్ 4.0 అవగాహన కార్యక్రమాల్లో భాగంగా గురువారం టి.చదివేవాండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన డైట్ కళాశాల అధ్యాపకులు శ్రీనివాసులురెడ్డి విద్యార్థులకు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు ప్రకాష్, జగన్‌మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

దళారి సినిమా టీజర్ ఆవిష్కరణ

కురబలకోట: విడుదలకు సిద్ధంగా ఉన్న దళారి సినిమా టీజర్‌ను గురువారం మండలంలోని అంగళ్లు గోల్డన్‌వ్యాలీ కళాశాలలో ఆ సినిమా టీమ్ ఆవిష్కరించారు. ఆకృతి క్రియేషన్స్ బ్యానర్‌పై కె. గోపాల్‌రెడ్డి దర్శకత్వంలో ఎ. వెంకటరెడ్డి నిర్మాతగా వస్తున్న ఈ సినిమాలో షకలక శంకర్, రాజీవ్ కనకాల, హీరోయిన్‌గా అక్షఖాన్, రూపిక నటిస్తున్నారు. కలికిరికి చెందిన పందు చెలిమి కీలక పాత్ర పోషించినట్లు దర్శకులు గోపాల్‌రెడ్డి తెలిపారు.

యోగ నేలమల్లేశ్వరా.. హరోంహరా..

● స్వయంభువుగా వెలసిన శంకరుడు ● శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

నిమ్మనపల్లె : మహాశివరాత్రికి నియోజకవర్గంలోని శైవక్షేత్రాలు సిద్ధమవుతున్నాయి. మండలంలోని తవళం గ్రామపరిధిలో పెండ్లిగుండ్లకనుమలో వెలసిన యోగనేలమల్లేశ్వరుడు స్వయంభువు. స్వామివారిని నమ్మి కొలిచిన వారి సకల పాపాలు తొలగుతాయని ఇక్కడి ప్రజల నమ్మకం. ఇక్కడ రెండు పుష్కరిణులు కలిగి ఉండటం విశేషం. ఇక్కడ ప్రతి ఏటా మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. మహాశివరాత్రి జాగరణ, పగటి తిరుణాలకు జనం వేల సంఖ్యలో పోటెత్తుతారు. ఇందులో భాగంగా శనివారం మహాశివరాత్రి పర్వదినాన ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

– ఈనెల 18, 19 తేదీలలో మహాశివరాత్రి ఏర్పాట్లు పెద్ద ఎత్తున చేసేందుకు ఈఓ మంజుల ఆధ్వర్యంలో ఆలయకమిటీ ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తోంది. భక్తులకు సౌకర్యవంతంగా మదనపల్లె-2 ఆర్టీసీ డిపో అధికారులు 5 ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తెస్తున్నారు. నిమ్మనపల్లె-మదనపల్లె-తవళం, నిమ్మనపల్లె-కందూరు-తవళం సర్వీసులను నడిపేందుకు చర్యలు తీసుకున్నారు. 18న రాత్రి శివపార్వతుల కల్యాణం, రాత్రి తిరుణాల, 19న ఆదివారం పగటి తిరుణాల జరుగుతుంది.



శ్రీ నేలమల్లేశ్వరస్వామి స్వయంభు విగ్రహం



నల్లంవారిపల్లె వద్ద ఏర్పాటు చేసిన ఆలయ ఆర్చి

హంస వాహనంపై సిద్దేశ్వరుడు

కలకడ : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ శ్రీకామాక్షిసమేత సిద్దేశ్వరస్వామిని వడ్డెర కులస్తులు ఏర్పాటు చేసిన హంసవాహనంపై ఊరేగించారు. ప్రతి ఏడాది నిర్వహించే ఉత్సవాలలో భాగంగా ఈ ఏడాది బుధవారం రాత్రి అలంకరించిన చాందినీబండిపై స్వామివారిని రంగురంగుల విద్యుత్‌దీపాలతో కలకడ పురవీధులలో ఊరేగించారు. చాందినీబండి ముందు ఏర్పాటు చేసిన కోలాటం, చెక్కభజన భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయం ముందు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



వాలీశ్వరుడికి పూజలు

రామసముద్రం: రామసముద్రం మండలంలోని ఆర్.నడింపల్లె పంచాయతీ బల్లసముద్రం సమీపంలో కొండపై వెలసిన శ్రీవాలీశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 18వ తేదీ స్వామివారికి రుద్రాభిషేకాలు, 19న కళ్యాణోత్సవం, 20వ తేదీన రథోత్సవం, 21 దీపోత్సవం, 22న వసంతోత్సవం, త్రిశూలస్నానం, ధ్వజారోహణంతో ఉత్సవాలు ముగియనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు లోకనాథ దీక్షిత్ తెలిపారు. ప్రతిఏటా వాలీశ్వరస్వామి కొండపై మహాశివరాత్రి ఉత్సవాలకు స్థానిక భక్తులతో పాటు కర్నాటక , తమిళనాడు నుంచి తరలివస్తారు.



ప్రారంభమైన శివరాత్రి ఉత్సవాలు



ధ్వజారోహణ కార్యక్రమంలో అర్చకులు, భక్తులు

పీలేరు రూరల్ : స్థానిక కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ధ్వజారోహణ కార్యక్రమంతో ప్రారంభం అయ్యాయి. గురువారం స్వామివారి ఆలయంలో గణపతిపూజ, గణపతి ఆరాధన, స్వస్తిపుణ్యావాచనం, కలశస్థాపన, నవగ్రహ ఆరాధన, ధ్వజారోహణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి మహామంగళ హారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు కుమార్ శాస్త్రి మాట్లాడుతూ శుక్ర, శనివారం విశేష పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఆదివారం త్రిశూల స్నానం, శివపార్వతుల గ్రామోత్సవం, ధ్వజ అవరోహణ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, పెద్దోడు, అబీద్, కిరణ్, హబీబ్‌బాషా, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకలకు మల్లయ్యకొండ ముస్తాబు

కురబలకోట: శివరాత్రి వేడుకలకు అంగళ్లు మల్లయ్యకొండకు వచ్చే భక్తులు, సందర్శకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఎంపీపీ బి. దస్తగిరి, తహసీల్దార్ ఎం. భీమేశ్వర రావు తెలిపారు. గురువారం వారు వివిధ శాఖల అధికారులతో కలసి కొండపై ఏర్పాట్లు పరిశీలించారు. నీడ, నీరు, పరిసరాల పరిశుభ్రత, రోడ్డు, ఆర్టీసీ బస్సుల రాకపోకలు, వసతి సౌకర్యాలను పర్యవేక్షించారు. ఎలాంటి సమస్య లేకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు గావించినట్లు తెలిపారు. ప్రశాంతంగా వేడుకల నిర్వహణకు అందరూ సహకరించాలని వారు కోరారు. ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి, ఎంపీడీఓ దిలీప్‌కుమార్, ఎస్‌ఐ సుకుమార్, స్థానిక కార్యదర్శి సఫియా, తుమ్మచెట్లపల్లెకు చెందిన జరిపిటి రామమూర్తి, శెట్టి భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



అంగళ్లు మల్లయ్యకొండపై ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎంపీపీ, అధికార యంత్రాంగం

నేటి నుంచి శివరాత్రి ఉత్సవాలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి.సదుం పంచాయతీలోని పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీ పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. 17న అంకురార్పణ, ధ్వజారోహణం, కలశ ప్రతిష్ఠ, 18న మహా రుద్రాభిషేకం, మహా మంగళ హారతి, రాత్రి కళ్యాణోత్సవం, 19న బ్రహ్మ రథోత్సవం, 20న పార్వేటోత్సవం, అన్నమయ్య సంకీర్తనలు, 21న వసంతోత్సవం, శయనోత్సవం, 22న స్వామి వారి విశ్వరూప దర్శనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్త ఆంజనేయరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ పి.శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి

గుర్రంకొండ: గుర్రంకొండలో శ్రీకృష్ణదేవరాయల జయంతి ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక కలకడ క్రాస్‌లో ఉన్న శ్రీకృష్ణ దేవరాయల విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. అన్నదానం చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బలిజ సంఘం నాయకులు సుంకర శ్రీనివాసులు, నక్కాగోపాలకృష్ణ, మాజీ ఎంపీపీలు నక్కా చంద్రశేఖర్, జమీర్ ఆలీఖాన్, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, ఎంపీటీసీ ఖదీర్, స్థానిక బలిజ సంఘం నాయకులు మేకల చలపతి, నాయిని జగదీష్, రెడ్డికోట రామస్వామి, నాయిని శివశంకర్, సుంకర విజయకుమార్, ఆర్ఎస్ఎస్ కిషోర్, సుంకరరాము, లెక్చరర్ జమీర్, పీడీ చింతిర్ల రమేష్ , హౌస్‌ఫెడ్ కార్యదర్శి గయాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రంలో గురువారం శ్రీ కృష్ణదేవరాయల జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బలిజ సంఘం నాయకులు, ముఖ్య అతిథులుగా హాజరైన ప్రజా ప్రతినిధులు మాట్లాడారు.



రామసముద్రంలో మాట్లాడుతున్న టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్

నిమ్మనపల్లె : మండల కేంద్రం నిమ్మనపల్లెలో విజయనగర సామ్రాజ్యాధినేత, చక్రవర్తి శ్రీ కృష్ణదేవరాయల జయంతిని బలిజసంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సంఘం నాయకులు మాజీ సర్పంచ్ శ్రీరాములు, మండల బలిజసంఘం అధ్యక్షులు ఆకుల శ్యాంప్రసాద్ తదితరులు శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బలిజ సంఘం నాయకులు వాసు, టీస్టాల్ శివ, ధన, శ్రీకాంత్, తేజ పాల్గొన్నారు.

టీటీడీ కల్యాణ మండపం అభివృద్ధికి కృషి

రామసముద్రం: రామసముద్రం మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని టీటీడీ బోర్డు సభ్యులు పోకల అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం రామసముద్రంలో జరిగిన శ్రీకృష్ణదేవరాయల జయంతి ఉత్సవాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక లక్ష్మీజనార్ధనస్వామి ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీటీడీ కల్యాణ మండపంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపంలో శ్రీకృష్ణ దేవరాయల విగ్రహ ప్రతిష్ఠకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి, మదనపల్లె బిటి కాలేజ్ ప్రిన్సిపాల్ మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

మదనపల్లె సిటీ: ఉర్దూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అయాబ్ హుసేన్ కోరారు. గురువారం స్థానిక మార్పురివీధిలోని ఉర్దూ అకాడమీ కంప్యూటర్ శిక్షణా కేంద్రం, ఉర్దూ లైబ్రరీలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. వక్ఫ్‌బోర్డు చైర్మన్ కరీముల్లా, కౌన్సిలర్ ముబీనా, సిబ్బంది షరీఫ్, అల్లాబక్షు, మహబూబ్‌బాషాలు పాల్గొన్నారు.

సైదాపేట స్కూల్ తనిఖీ

నిమ్మనపల్లె : మండల పరిధిలోని వెంగంవారిపల్లె పంచాయతీ సైదాపేట ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ రాజగోపాల్ గురువారం తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నభోజన నాణ్యతను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువుల్లో రాణిస్తేనే బంగారు భవిష్యత్తు

– కేజీబీవీ స్పెషలాఫీసర్ త్యాగరాజు



మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ త్యాగరాజు

కురబలకోట: విద్యార్థినులు చదువుల్లో రాణించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కురబలకోట కేజీబీవీ స్కూల్ నూతన స్పెషలాఫీసర్, జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడి టి.త్యాగరాజు సూచించారు. గురువారం ఆయన ముదివేడు దగ్గరున్న కేజీబీవీ స్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. స్టోర్ రూమ్, వంట గది, పరిసరాలు పరిశీలించారు. విద్యార్థినుల్లో అభ్యసన స్థాయిని పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని సబ్జెక్టుల్లో విద్యార్థులను టీచర్లు సిద్ధం చేయాలన్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ఇప్పటి నుండే పత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

ప్రతి ఇంటా మా నమ్మకం నువ్వే జగన్

– ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: పేదలకు అండగా నిలుస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి కుటుంబం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలోని బయ్యప్పగారిపల్లె పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులతో మాట్లాడుతూ ప్రతిఇంటికి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అంటిచడమే కాక ఆ కుటుంబాలతో మమేకం కావాలని కోరారు. సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థిక లబ్ధిపొందిందని అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు, ప్రతిపల్లెకు తారురోడ్ల నిర్మాణం, సమస్యల పరిష్కారం జరిగాయని, వీటిని వివరించాలన్నారు. గ్రామసచివాలయాలతో పల్లెల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయని, దీనివల్ల ప్రజలకు వ్యయప్రయాసలు తగ్గాయని, సత్వరమే సేవలు అందుతున్నాయని అన్నారు. చేసిన పనులను ప్రజలకు వివరించి చెప్పాలని కోరారు. అనంతరం స్థానిక నాయకులు ఎమ్మెల్యేను కర్ణాటక సంప్రదాయంతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచు భీమిగాని నాగిరెడ్డి, ఎంపీటీసీ రమాదేవి, పవర్ వాటర్ టెక్ ఎండీ భీమిగాని పద్మనాథరెడ్డి, రిటైర్డ్ జేడీ చేలూరి శివారెడ్డి, మాజీ ఎంపీటీసీ విజయభాస్కర్ రెడ్డి, గోపాలు, సుధాకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, యుగంధర్ రెడ్డి, పచ్చిపాల రెడ్డెప్ప పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

పేర్నాటికి మద్దతుగా ప్రచారం

బి.కొత్తకోట: తూర్పు పట్టభద్రుల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మద్దతుగా గురువారం బి.కొత్తకోట మండలంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు ప్రచారం నిర్వహించారు. సచివాలయాల్లో పనిచేస్తున్న పట్టభద్రులను కలిసి పేర్నాటిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ ఖాదర్‌వలీ, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నేరేళ్ల రెడ్డిహరి, సర్పంచులు సాంబశివ, పుష్పలత, రుక్మిణీ, జయరామిరెడ్డి, ఉమామహేశ్వరీ, ఎంపీటీసీ విమలమ్మ, రామసుబ్బారెడ్డి, నాయకులు నరేష్‌రెడ్డి, చిన్నికృష్ణ, చాంద్‌బాషా, హరికృష్ణ, జీవి.రామకృష్ణ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు

పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలి

– ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ ధనలక్ష్మి

మదనపల్లె : అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదుచేసుకున్న 0–6 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలందరిని సమీపంలోని సచివాలయాల్లో ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రాల్లో కార్డులు ఇప్పించి, నెంబర్‌ను యాప్‌లో నమోదుచేయాలని ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ ధనలక్ష్మి అన్నారు. గురువారం మదనపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్, వర్కర్స్‌తో స్థానిక కార్యాలయంలో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీడీ ధనలక్ష్మి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో రెగ్యులర్‌గా అందిస్తున్న సేవలు, యాప్ విధానం, నిర్వహణపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. కేంద్రాల్లో అందించే అన్ని సేవలకు సంబంధించి రిజిస్టర్లు అప్‌డేట్‌లో ఉంచుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సివిల్ సప్లయిస్, కాంట్రాక్టర్ల నుంచి పంపిణీ అయ్యే అన్నివస్తువుల నాణ్యతను తనిఖీ చేసుకుని సకాలంలో లబ్ధిదారులకు అందించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ సుజాత, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా విద్యుత్ స్తంభాల మార్పు

పెద్దతిప్పసముద్రం: తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఇటీవల చేపట్టిన గడప–గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు అధికంగా విద్యుత్ సమస్యలను తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు డిస్కం ఏఈ ఉత్తన్న సిబ్బందితో కలసి గ్రామాల్లో శిథిలావస్థలో, కూలడానికి సిద్ధంగా ఉన్న, ఇళ్ల వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను గత వారం రోజుల నుంచి తొలగిస్తూ వాటి స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి ప్రజా సమస్యలను పరిష్కరించారు.



విశేష పూజలు

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె పంచాయతీ కొత్తపల్లెలో అక్కదేవతలకు విశేష పూజలు నిర్వహించారు. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు అక్కదేవతల ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు భక్తులు ఆలయం వద్ద జాగారం చేపట్టారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేటి నుంచి తిరునాల

కలికిరి: మండలంలోని కలికిరి గ్రామ పంచాయతీ చెక్కెరవాండ్లపల్లి వద్ద వెలసిన అక్కదేవత తిరుణాల మూడు రోజుల పాటు అంగరంగవైభవంగా జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం రాత్రి కలికిరి ఆంజనేయస్వామి ఆలయం నుంచి అక్కదేవతల ఆలయం వరకు చాందినీ బండ్ల ఊరేగింపు, శనివారం ఉదయం పచ్చవేయుట, కొడి స్థంభం వెలిగించుట, 19న ఝురి కార్యక్రమం జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత ఒంటిల్లు జట్టు



విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన నిర్వాహకులు

పీలేరు రూరల్ : మండలంలోని కావలిపల్లె పంచాయతీ ఒంటిల్లులో గత నాలుగు రోజులుగా జరిగిన శ్రీ రఢవీర గంగమ్మ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా ఒంటిల్లు జట్టు నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం ఎనిమిది జట్లు పోటీ పడ్డాయి. గురువారం ఒంటిల్లు, దొడ్డివారిపల్లె జట్ల మధ్య ఫైనల్ పోటీ నిర్వహించారు. ఒంటిల్లు జట్టు విజేతగా నిలిచి ప్రథమ బహుమతి రూ. 20 వేలు తోపాటు ట్రోఫీ సొంతం చేసుకుంది. ద్వితీయ స్థానంలో నిలిచిన దొడ్డివారిపల్లె జట్టుకు రూ.10 వేలు నగదు బహుమతి అందజేశారు. టోర్నమెంట్ నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు లోకనాథరెడ్డి విజేతలకు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహబాషా, మల్లికార్జున, వెంకటప్పనాయుడు, అమరనాథనాయుడు, సద్దాం, సయ్యద్‌షావలి, రామానాయుడు, ప్రకాష్, నరేష్ పాల్గొన్నారు.

అవగాహనతోనే క్యాన్సర్ వ్యాధి దూరం

వాల్మీకిపురం: క్యాన్సర్ వ్యాధి ప్రాథమిక దశలో గుర్తిస్తే వ్యాధిని దూరం చేయొచ్చని శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ వైద్యాధికారిణి జ్యోతిర్మయి అన్నారు. గురువారం స్థానిక కొత్త ఇందిరమ్మ కాలనీలో శ్రీ షిరిడిసాయిబాబా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళల కోసం పింక్ బస్ ద్వారా ఉచిత క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. తదుపరి రోగులకు క్యాన్సర్ వ్యాధిపట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ ఆఫ్ స్విమ్స్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రచురించిన క్యాన్సర్‌ను ఎలా ఎదుర్కోవాలి అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన వైద్య శిబిరంలో 98 మందికి క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ వైద్యులు నిఖిత, మౌనిక, లిఖిత, జాగృతి, పూజిత, పూజ, శ్రీసాయిగీత, శ్రీజ, చైతన్యబాను, పద్మజ, రాజశేఖర్, షిరిడిసాయిబాబా చారిటబుల్ ట్రస్టు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

మదనపల్లె : పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు తాలూకా ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం మండలంలోని వేంపల్లె సమీపంలోని ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రి సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.22,890 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

– పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.3,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ ఏఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

విద్యార్థులను తీర్చిదిద్దండి



సమావేశంలో మాట్లాడుతున్న రంగరాజు

బి.కొత్తకోట: విద్య కోసం ప్రభుత్వం వేలకోట్లు ఖర్చు చేస్తోంది, దానికి తగ్గట్టుగా విద్యార్థుల భవిష్యత్తును ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని కార్మిక శాఖ జిల్లా ఇన్‌చార్జ్ అధికారి డి.రంగరాజు అన్నారు. గురువారం ఆయన స్థానిక ప్రభుత్వ ఆదర్శ విద్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు, హాస్టల్, మధ్యాహ్న భోజనం, తరగతి గదులు పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధన తిలకించారు. విద్యార్థులతో మాట్లాడి ఇబ్బందులను అడిగి తెలుసుకొన్నారు. పది, ఇంటర్ విద్యార్థుల ఉత్తీర్ణత వంద శాతం సాధించాలన్నారు. ఎంఈవో రెడ్డిశేఖర్, ప్రిన్సిపాల్ శీనునాయక్, సూపర్‌వైజర్ హిజాద్‌ప్యారీ, వివిధశాఖల సిబ్బంది పాల్గొన్నారు.